Eenadu DT-25/05/18.



# ప్రచార తెర.. మెట్రోకు దడ!

- జేఎన్‌టీయూ స్టేషన్ సమీపంలో విద్యుత్తు తీగలపై పడిన ప్రచార తెరలు
- మియాపూర్-అమీర్‌పేట మార్గంలో అరగంటపాటు రాకపోకలు నిలిపివేత



జేఎన్‌టీయూ స్టేషన్ సమీపంలో తీగలపై ప్రచార తెర

ఈనాడు, హైదరాబాద్

మెట్రోరైలు సేవలకు ప్రకటనల ప్రచార తెరలు (ఫ్లెక్సీలు) ఆటంకంగా మారాయి. నగరంలో ఈదురుగాలులు వీచిన ప్రతిసారీ హోర్డింగ్‌లకు ఉన్న ఫ్లెక్సీలు ఎగిరి వచ్చి మెట్రోరైలు ఓవర్‌హెడ్ ట్రాక్షన్ విద్యుత్తు లైన్లకు చిక్కుకుంటున్నాయి. ఫలితంగా ఆ మార్గంలో ఉన్నపళంగా మెట్రోరైళ్లను ఆపేయాల్సి వస్తోంది. గురువారం కూకట్‌పల్లి ప్రాంతంలో ఈదురుగాలుల ధాటికి మెట్రో మార్గానికి సమీపంలో ఎత్తయిన భవనాలపైన హోర్డింగ్‌లకు ఉన్న ఫ్లెక్సీలు చిరిగి జేఎన్‌టీయూ మెట్రోస్టేషన్ సమీపంలో విద్యుత్తు తీగలపై పడ్డాయి. అప్రమత్తమైన లోకో పైలెట్ మెట్రోను ఆపడంతో పాటూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. మియపూర్ నుంచి అమీర్‌పేట మార్గంలో సాయంత్రం 5.35 నుంచి 6.05 వరకు అరగంట పాటూ మెట్రోరైళ్లను నిలిపేశారు. తొలగించాక సేవలను పునరుద్ధరించారు.

### ఈ నెలలో మూడోసారి...

గాలులకు ప్రచారతెరలు మెట్రో విద్యుత్తు లైన్లకు చిక్కుకుని సేవలకు ఆటంకం కలగడం ఇటీవలి కాలంలో ఇది మూడోసారి. ఈ నెల 17న గాలివానకు ముందుజాగ్రత్తగా సాయంత్రం పూట 4.30 నుంచి 5.20 వరకు 50 నిమిషాల పాటూ మెట్రోను నిలిపేశారు. ఈ నెల 2న ఫ్లెక్సీలు విద్యుత్తు తీగలపై పడటంతో అమీర్‌పేట-నాగోల్ మార్గంలో సాయంత్రం 26 నిమిషాల పాటూ మెట్రోను నిలిపేయాల్సి వచ్చింది. 'మెట్రో మార్గంలో ఫ్లెక్సీలు ఎక్కడెక్కడ ప్రమాదకరంగా ఉన్నాయో గుర్తించి, జీహెచ్ఎంసీతో కలిసి చర్యలు చేపట్టనున్నట్లు' మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి 'ఈనాడు'తో అన్నారు.